క్లుప్తంగా

చంద్రయాన్ ప్రయోగాన్ని వీక్షించిన విద్యార్థులు


ప్రయోగాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం : చంద్రయాన్-3 ప్రయోగాన్ని విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం నింగికెగసిన చంద్రయాన్ ప్రయోగాన్ని వీక్షించేందుకు హెచ్ఎం రాము టీవీ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో వారంతా ఎంతో ఉత్సాహంగా ప్రయోగాన్ని వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు.

కింతలి - ఘాట్‌రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మాడుగుల రూరల్: కింతలి నుంచి ఘాట్‌రోడ్డు వరకు రహదారి పనులకు శుక్రవారం కింతలి వల్లాపురం సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ రోడ్డుతోపాటు ఘాట్‌రోడ్డుపై గురువారం అధికారులతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అత్యవసర సమావేశం నిర్వహించి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. సీనియర్ నాయకుడు తాళ్లపురెడ్డి రాంబాబు, కింతలి గ్రామ శాఖ అధ్యక్షుడు జామి చిన్న, ఎంపీటీసీలు బగుడు వరహాలమ్మ, సీతారామయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు టి. సోమన్నదొర, మాజీ సర్పంచ్ మైచర్ల సత్యంనాయుడు, నాయకులు దండి హేమ, మట్టా గోవింద, చామంతులు వెంకటరమణ, మైచర్ల చంద్రరావు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారి దమయంతీదేవి

చోడవరం రూరల్: డెంగ్యూ మాసోత్సవంలో భాగంగా శుక్రవారం చోడవరం ప్రాంతీయ ఆరోగ్య కేంద్రంలోని మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌సీలో ర్యాలీని గవరవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డి.దమయంతీదేవి ప్రారంభించారు. వారంలో ప్రతి శుక్రవారం దోమలు వ్యాప్తి చెందకుండా నిల్వ నీరు ఉండకుండా చూసుకోవాలని కోరారు. చోడవరం సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్.వి.రమణ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ కొత్తూరు జంక్షన్ వరకు నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. చోడవరం సీహెచ్‌సీ సూపరింటెండెంట్, వైద్యాధికారులు, గవరవరం పీహెచ్‌సీ సిబ్బంది, మేల్ స్టాఫ్, ఆశా వర్కర్లు, సచివాలయం సీహెచ్‌వోలు, టీబీ యూనిట్ సభ్యులు, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని సాయిశ్రీ

చోడవరం రూరల్: గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని సలాది సాయిశ్రీ నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. పదో తరగతిలో 577 మార్కులు సాధించినామె ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంతో ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్ సింగ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చప్పగడ్డి అప్పలనాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

యాంత్రీకరణతో వరినాట్లు


బోయిలకింతాడలో నారు తయారీ పద్ధతిని పరిశీలిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: యాంత్రీకరణ పద్ధతిలో వరి నాట్లు వేయడంపై దృష్టి సారించాలని ఏవో వై. కాంతమ్మ సూచించారు. బోయిలకింతాడలో నారు మడి తయారీని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యంత్రాల ద్వారా వరి నాట్లు వేయడం వల్ల కూలీల ఖర్చు తదితర పెట్టుబడులు తగ్గడంతోపాటు దిగుబడి పెరుగుతుందనారు. బోయిలకింతాడ, తారువ, మారేపల్లి గ్రామాల్లో 18 మంది రైతులు ఈ పద్ధతిలో నాట్లు వేసేందుకు ముందుకు వచ్చారన్నారు. ఏఈవో ఎస్. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పైసా ఖర్చు లేకుండా ధ్రువపత్రాల జారీ

- జగనన్న సురక్ష కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


తెనుగుపూడిలో ధ్రువపత్రాలను అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


బుచ్చెయ్యపేట: చింతపాకలో సర్టిఫికెట్లు అందిస్తున్న విప్ ధర్మశ్రీ


గొలుగొండ: చీడిగుమ్మలలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే గణేష్


కె.కోటపాడు: మర్రివలసలో ధ్రువపత్రాలను అందిస్తున్న అనురాధ, జగన్‌మోహన్

దేవరాపల్లి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యోద్దేశమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. శుక్రవారం తెనుగుపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 400 మందికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా ఇంటింటా జల్లెడ పట్టి సర్వే నిర్వహించి శతశాతం సంక్షేమ పథకాలు అందించడం చరిత్రాత్మకమని అన్నారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషిన నళిని, ఏవో వై. కాంతమ్మ, సర్పంచ్ తాడి సామాలు, ఎంపీటీసీ పాటేళ్ల ఈశ్వరమ్మ, కిల్లాన శ్రీనివాసరావు, దాసరి గోవిందరావు, వీసారపు అప్పారావు, సలాది కొండలరావు, పెంటకోట శ్రీను పాల్గొన్నారు.

గరిశింగిలో 218 మందికి ధ్రువపత్రాలను మండల ప్రత్యేక అధికారి వి. రవీంద్రనాథ్, సర్పంచ్ గూడెపు రాము అందజేశారు. పంచాయతీ సెక్రటరీ పి. యశోద, వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు గూడెపు మోహన్, మాజీ సర్పంచ్ పాట్నూరు రమేష్, సచివాలయ కన్వీనర్ పోడెల నాని పాల్గొన్నారు.

ప్రజల సౌలభ్యం కోసమే సురక్ష : విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: ప్రజల సౌలభ్యం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. శుక్రవారం చింతపాకలో 1,204 మందికి, గున్నెంపూడిలో 995 మందికి పలు రకాల సర్టిఫికెట్లను ఆయన అందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు కార్యాలయాల చుట్టు తిరగకుండా విద్యా సంవత్సరం ఆరంభంలో విద్యార్థులు అవస్థలు పడకూడదని అన్ని గ్రామాల్లో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నామన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, సర్పంచ్‌లు గొలజాన శ్రీను, ముచ్చకర్ల హరిణి అప్పారావు, ఎంపీటీసీ కేశంశెట్టి సుశీల వెంకటరమణ, నాయకులు సోమిరెడ్డి సత్తిబాబు, తాతారావు పాల్గొన్నారు.

చోడవరం: మండలంలోని రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష గ్రామసభలు జరిగాయి. గాంధీ గ్రామంలో 740 మందికి, అడ్డూరు సచివాలయం పరిధిలో 437 అర్జీలను పరిష్కరించి సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, తహసీల్దార్ తిరుమల బాబు, ఎంపీడీవో చైతన్య, మండలపరిషత్ సూపరింటెండెంట్ అమ్మాజీ, గాంధీ గ్రామం సర్పంచ్ గాడి అప్పారావు, ఆర్ఐ వి.వి. గిరి, హైస్కూల్ కమిటీ చైర్మన్ దాడి జగదీష్, ఉప సర్పంచ్ కోలా రమణ, టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు వేచలపు ప్రకాష్, మాజీ సర్పంచ్ గాతాడ అప్పారావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నాగిరెడ్డి నారాయణమూర్తి పాల్గొన్నారు.

సురక్షతో ప్రజలకు మేలు : ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. శుక్రవారం చీడిగుమ్మలలోని జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇటువంటి మంచి పరిపాలన అందిస్తున్న సీఎంకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. చోద్యంలోనూ కార్యక్రమం నిర్వహించారు. ఈ రెండు పంచాయతీల్లో 1,285 మందికి 11 రకాల సర్టిఫికెట్లు అందించారు. ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, రాష్ట్ర శెట్టి బలిజ డైరెక్టర్ బొండల రాజు, చీడిగుమ్మల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు కాపారపు చిన్నబ్బాయి, లెక్కల అప్పలనాయుడు పాల్గొన్నారు.

కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేదు

నర్సీపట్నం: వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా ప్రజల వద్దకే వచ్చి సేవలందించేలా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఆర్డీవో హెచ్.వి. జయరాం అన్నారు. మున్సిపాలిటీ 3వ సచివాలయం, రూరల్ మండలంలో గురంధరపాలెంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కమిషనర్ కనకారావు, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, కౌన్సిలర్ డాడి రత్నంలతో కలిసి రెండు చోట్ల 1,200 సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మండల సచివాలయ కన్వీనర్ శానాపతి వెంకటరత్నం పాల్గొన్నారు.

చీడికాడ: జి.కొత్తపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, సర్పంచ్ కొల్లి సూరినాయుడు, ఎంపీటీసీ కొల్లి నాగమణి, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో జయప్రకాష్, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, నేతలు కొల్లి శ్రీను, పుట్టా రాంకుమార్ పాల్గొన్నారు.

కె.కోటపాడు: మర్రివలస, కొరువాడ గ్రామాల్లో జగనన్న సురక్ష గ్రామసభల్లో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఎంపీపీ జగన్‌మోహన్ పాల్గొన్నారు. ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు పొంతపల్లి అప్పలనర్సమ్మ, ఎంపీటీసీ కోటాన అశోక్, చీపురుపల్లి అచ్చిబాబు, మండల సచివాలయాల కన్వీనర్ ఏటుకూరి రాజేష్, మండల ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి పాల్గొన్నారు.

నాతవరం: పి.కె.గూడెంలో తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, నాతవరంలో ఎంపీడీవో హనుమంతరావు ఆధ్వర్యంలో సురక్ష గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీ పైల సునీల్, సర్పంచులు లగుడు నాగేశ్వరరావు, గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, పి.కె.గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి అచ్చెర్ల వరహాలబాబు, ఎంపీటీసీ గాడి రమేష్, గృహసారథులు మండల కన్వీనర్ అడిగర్ల నాయుడు, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు పైల పోతురాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు పాల్గొన్నారు.

మాకవరపాలెం: శెట్టిపాలెం, పాపయ్యపాలెం గ్రామాల్లో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రుత్తల సత్యనారాయణ మాట్లాడుతూ శెట్టిపాలెం సచివాలయానికి ఎమ్మెల్యే గణేష్ రూ.20 లక్షలు మంజూరు చేశారన్నారు. ఇంకా అదనపు నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా, పంచాయతీల తీర్మానాలు ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, సచివాలయ మండల కన్వీనర్ చిటికెల రమణ, సర్పంచ్‌ల ఫోరం నియోజకవర్గ కన్వీనర్ బొడ్డు గోవిందరావు, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గొర్లి వరలక్ష్మి, నాయకులు పెట్ల భద్రాచలం, వర్రి పాత్రుడు, వాసుదేవరావు, యర్రా లోవ పాల్గొన్నారు.

రోలుగుంట: గుండుబాడులో తహసీల్దార్ కె.వరహాలు, అడ్డసరంలో ఎంపీడీవో కె.ప్రభాకరరావు బృందం ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. గుండుబాడులో సర్పంచ్ మామిడి అప్పలనర్స, అడ్డసరంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్సారపు కృష్ణ, రాము నాయుడు, అధికారులు పాల్గొన్నారు.


మాకవరపాలెం: శెట్టిపాలెంలో ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, తదితరులు


నర్సీపట్నం: మున్సిపాలిటీలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్డీవో జయరాం


రోలుగుంట: ధ్రువపత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ వరహాలు, సర్పంచ్ అప్పలనర్స


చీడికాడ: లబ్ధిదారుకు ధ్రువపత్రం అందిస్తున్న ఎంపీపీ జయమ్మ

ఎమ్మెల్యే కృషితోనే ఈనాం భూ సమస్య పరిష్కారం


మాట్లాడుతున్న కొత్త ఎల్లవరం నాయకులు

గొలుగొండ: నర్సీపట్నం నియోజకవర్గంలో 40 ఏళ్లుగా పరిష్కారం కాని ఎన్నో సమస్యలను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పరిష్కరించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని కొత్త ఎల్లవరం ఎంపీటీసీ వలగల పెదదేముడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు చీపురపల్లి అప్పారావు, సీనియర్ నాయకుడు కొల్లు శ్రీను తెలిపారు. ఈ నెల 8న కొత్త ఎల్లవరం ఈనాం భూ సమస్యలపై ఎమ్మెల్యే, గొలుగొండ మండల నాయకులు నర్సీపట్నం ఆర్డీవో జయరాంతో రెండు గంటల పాటు సమీక్షించారన్నారు. నెల రోజుల్లో పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. ఇది తెలిసి కూడా జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు రాజాన సూర్యచంద్ర ఈ నెల 13న ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కృషితో ఈ సమస్య త్వరలో పరిష్కారం కానుందన్నారు. నర్సీపట్నంలో 40 ఏళ్లుగా నోచుకోని ప్రధాన రోడ్డు విస్తరణ త్వరలో ప్రారంభం కానుందన్నారు. శతాబ్దకాలంగా పరిష్కారం కాని ఆరిల్లోవ రోడ్డు పనులు ఎమ్మెల్యే కృషితో ప్రారంభమయ్యాయన్నారు. రెండున్నరేళ్లు కష్టపడి దీన్ని పరిష్కరిస్తే తమ పోరాటం వల్లే ఈ రోడ్డు వచ్చిందని చెప్పుకుంటున్న జనసేన పార్టీ నాయకులకు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు 4,095 మొక్కల పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి జెడ్పీటీసీ అప్పలనర్స

నాతవరం: మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స తెలిపారు. వెలుగు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద డ్వాక్రా సంఘాల సభ్యులకు వివిధ జాతులకు చెందిన 4,095 మొక్కలను వారు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపడుతుందని, వాటితోపాటు మొక్కలు పెంచే కార్యక్రమాలు చేస్తుందన్నారు. నాటిన మొక్కను పెంచే బాధ్యతను అందరూ తీసుకున్నప్పుడే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్నారు. ఎంపీడీవో హనుమంతరావు, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు పైల పోతురాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, ఉపాధి ఏపీవో చిన్నారావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చినబాబు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి స్థల సమస్య పరిష్కారం

- ఇరువర్గాలను ఒప్పించిన తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు


పి.జగ్గంపేట గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

నాతవరం: ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అందరూ ఐక్యంగా సహకరిస్తే గ్రామాభివృద్ధి చెందుతుందని తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. పి.జగ్గంపేటలో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవన నిర్మాణానికి రూ. 14 లక్షలు మంజూరయ్యాయి. ఇక్కడ ప్రభుత్వ స్థలంలో పనులు చేస్తుండగా కొందరు అడ్డుకోవడంతో వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో గ్రామంలో స్థలాన్ని తహసీల్దార్ ఎస్.ఎస్.వి శ్రీనివాస్‌నాయుడు శుక్రవారం పరిశీలించారు. సర్పంచ్ జీవిరెడ్డి సోమన్నదొర ఆధ్వర్యంలో ఇరువర్గాలతో చర్చించారు. చిన్నారుల, గర్భిణుల ఇబ్బందుల దృష్టిలో ఉంచుకుని ఇక్కడే నిర్మించాలని గ్రామస్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆ మేరకు ఇరువర్గాలను నచ్చజెప్పి ఒప్పించారు. వెంటనే అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులకు అప్పగించారు. వెంటనే పనులు ప్రారంభిస్తామని సర్పంచ్, ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. ఎట్టకేలకు తహసీల్దార్ చొరవతో స్థల సమస్య పరిష్కారం అయిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరీ, సూపర్‌వైజరు విజయలక్ష్మి, బీపీఎం కిరణ్‌కుమార్, ఆర్ఐ హరి, వీఆర్వో సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆరిల్లోవ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయండి

- నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్


ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: నర్సీపట్నం-కృష్ణదేవిపేట ప్రధాన రహదారిలో ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో చేపట్టిన రోడ్డు పనులకు నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ శుక్రవారం పరిశీలించారు. గత నెల 22న ఈ పనులు ప్రారంభం కావడంతో వాహనదారులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పనులు ఎంతమేర పూర్తయ్యాయో ఆయన పరిశీలించారు. ఈ పనుల కోసం రెండున్నరేళ్ల కష్టపడి అన్ని అనుమతులు తీసుకొచ్చానని, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టరుకు సూచించారు. ప్రస్తుతం వర్షాలకు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా పనులు చేయాలన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో వేలాది మంది వాహనదారులకు ఇబ్బందులు తొలగినట్టేనని చెప్పారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, పార్టీ యూత్ అధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, సర్పంచ్‌లు తోకల సంతోష్, పత్తి రమణ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలు నమోదు


యాప్‌ను డౌన్‌లోడ్ చేసిన ఉపాధ్యాయులు

రావికమతం: మండలంలో ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలను ప్రశస్త యాప్‌లో ఉపాధ్యాయులంతా నమోదు చేస్తున్నట్టు మండల ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు తెలిపారు. ఏపీ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసర్చ్ అండ్ ట్రెనింగ్(ఎన్‌సీఈఆర్టీ) రూపొందించిన ఈ యాప్‌ను ఉపాధ్యాయులంతా డౌన్‌లోడ్ చేసుకుని ఆయా పాఠశాలల్లో ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలను నమోదు చేస్తున్నారన్నారు. ఇప్పటికి 58 మంది వివరాలు నమోదు చేశామన్నారు.

నేడు వాహనాల వేలం

మాడుగుల: స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు శనివారం ఉదయం 10 .30 గంటలకు వేలం పాట నిర్వహించనున్నామని స్థానిక ఎస్ఈబీ సీఐ ఎస్. సంహాద్రి తెలిపారు. అనకాపల్లి ఎస్ఈబీ సూపరింటెండెంట్ రవికుమార్ పర్యవేక్షణలో ఐదు బైక్‌లకు, ఒక ఆటోకు వేలం వేస్తామన్నారు. పాడిన మొత్తం పాటకు 18 శాతం అదనంగా జీఎస్టీ చెల్లించాలన్నారు. ఇందులో పాల్గొనేవారు ముందుగా రూ.5 వేలు బయానా చెల్లించాలన్నారు. వేలం పాట దక్కని వారికి ఆ సొమ్ము వాపసు చేస్తామన్నారు. ఆధార్ తీసుకుని రావాలని సూచించారు.

మెయిన్ రోడ్డు విస్తరించి ట్రాఫిక్ కష్టాలు తీర్చండి

- గడపగడపలో ఎమ్మెల్యే గణేష్‌కు పట్టణవాసుల మొర


బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: మెయిన్ రోడ్డు విస్తరించి ట్రాఫిక్ కష్టాలు తీర్చండి.. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు పట్టణ ప్రజలు మొరపెట్టుకున్నారు. మున్సిపాలిటీ 5వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, నాయకులతో కలిసి ఆయన వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేశారు. ఈ క్రమంలో మెయిన్ రోడ్డు విస్తరణపై పట్టణ వాసులు ప్రస్తావించగా, కోర్టు అడ్డంకులు తొలగగానే చేపడతామని స్పష్టం చేశారు. సచివాలయంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్ దాడి రత్నం, మాజీ కౌన్సిలర్ గొలుసు సుమజ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషా బేగం, అర్జున్, పలు దేవస్థానాల చైర్మన్లు ధనిమిరెడ్డి నాగు, చెరుకూరి సత్యనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ మళ్ల గణేష్, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, ఎండీ బాషా, లగుడు స్వామి, పార్టీ నాయకులు దాడి బుజ్జి, గుడబండి నాగేశ్వరరావు, మామిడి శ్రీను, యూత్ నాయకులు ధనిమిరెడ్డి ప్రసాద్, పార్టీ మహిళా నాయకులు లోకవరపు శారద, గంటా లలిత, కణితి అన్నపూర్ణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ


రావికమతంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రావికమతం: నియోజకవర్గంలో ప్రతి సమస్యను పరిష్కరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. రెండో రోజు శుక్రవారం రావికమతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఎవ్వరైనా లంచాలు అడుగుతున్నారా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ కుళాయి పనులపై కామిరెడ్డి పద్మనాభం, కెదారి చిలుకమ్మ ఆయన దృష్టికి తీసుకురాగా, రూ.1.45 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు పూర్తవుతాయని చెప్పారు. ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని చిలుకమ్మ, రాపూడి చినమ్మలు తదితరులు వాపోయారు. మెయిన్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేశామని, త్వరలోనే ఆ సమస్య పరిష్కారం కానుందని ధర్మశ్రీ హామీ ఇచ్చారు. ఎంపీపీ పైల రాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి, మాజీ జెడ్పీటీసీ ఆశరి వాసు గోవిందరావు, మాజీ వైస్ ఎంపీపీ గంటా ఈశ్వరరావు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, భవానీప్రసాద్, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు పాల్గొన్నారు.

అర్హులు నష్టపోకూడదనే 'గడపగడపకు'

- తంగుడుబిల్లి గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్న డిప్యూటీ సీఎం బూడి


తంగుడుబిల్లిలో రైతులకు వరి విత్తనాలను అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: ఇంకా అర్హులైన వారు నష్టపోకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మమ్మిల్ని మీ వద్దకు పంపించారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. శుక్రవారం తరువోలు శివారు తంగుడుబిల్లిలో ఆయన ఇంటింటికీ తిరిగారు. నాలుగేళ్ల కాలంలో అందించిన సంక్షేమ పాలనకు సంబంధించిన బుక్‌లెట్లు అందించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రూ.11 లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటా కుళాయి తాగునీటి సరఫరా పరిశీలించారు. డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు, కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం అందించిన ఇళ్ల స్థలాలు కోర్టులో ఉందని పలువురు మహిళలు వాపోయారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. స్థలం ఉన్నవారికి ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించారు. అనంతరం 40 మంది రైతులకు ఖరీఫ్ వరి విత్తనాలు పంపిణీ చేశారు. సర్పంచ్ మట్టా అప్పారావు, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, చీడికాడ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, నేతలు బలిజి దేముళ్లు, ఆర్మీ నాయుడు, జె.వి.రమణ, బలిజి నాయుడు, లాలం శివకుమార్, చొక్కాకుల కోటి, పోతల అచ్చిబాబు పాల్గొన్నారు.

నేడు గాదిరాయిలో 'గడపగడపకు'

మాడుగుల రూరల్: గాదిరాయిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ శుక్రవారం తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొనే ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులపై నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం: ప్రైవేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేయటాన్ని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ(సీడీజెడ్) గ్రూపులను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో మెస్ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా యాజమాన్యాలు వేలకు వేలు ఫీజులు, పుస్తకాల రూపంలో దోచుకుంటున్నాయన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏవో సూర్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. డివిజన్ నాయకులు రాధాకృష్ణ, దొర పాల్గొన్నారు.